ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు

శనివారం 1 జూన్ 2024 | 5

ఎండా కాలమ్

	గరిష్టం	కనిష్టం
అమలాపురం	40	30

రాళ్లు ఢీకొని బోటు ధ్వంసం

● రూ. 4లక్షల నష్టం - 7లో



బ్యాంకులో పెన్షన్ పాట్లు (ఫైల్‌ఫొటో)

ఈనెలా.. తప్పవు తిప్పలు

పెన్షన్ల కోసం బ్యాంకులకు తిరగాల్సిందే

జిల్లాలో 2,43,932 మంది లబ్ధిదారులు

రూ.70.96 కోట్లు పంపిణీకి చర్యలు

అమలాపురం టౌన్, మే31: ఇంటింటికీ తిరిగి పెన్షన్లు పంపిణీ చేసేందుకు అవసరమైన మేర సిబ్బంది, సచివాలయాల ఉద్యోగులు అందుబాటులో ఉన్నప్పటికీ గత నెల అనుసరించిన విధానాన్నే ప్రభుత్వం అమలుచేస్తోంది. మే నెలలో మహిళలు, వృద్ధులు పెన్షన్ల కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెన్షన్ సొమ్ములకోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతానుభవాలను పరిగణలోకి తీసుకోకుండా యథావిధిగా జూన్‌లోనూ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు పెన్షన్ సొమ్ములు జమచేయడంతోపాటు దివ్యాంగులు, మంచాలకే పరిమితమైనవారికి మాత్రం ఇంటింటికీ తిరిగి పెన్షన్లు అందించేవిధంగా చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 2,43,932 మంది పెన్షన్‌దారులు ఉన్నారు. వీరిలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, చేనేతలు, కల్లుగీత కార్మికులు ఇలా వివిధ వర్గాలకు చెందినవారు ప్రతీ నెల పెన్షన్ పొందుతున్నారు. జిల్లాలో అనారోగ్యాల బారినపడి మంచానికే పరిమితమైన వారితోపాటు దివ్యాంగులు 69 వేల మందికి ఇంటింటికీ తిరిగి పెన్షన్లు అందించేవిధంగా ఆయా సచివాలయాలకు నిధులు విడుదల చేసినట్టు డీఆర్డీఏ పీడీ వి.శివశంకరప్రసాద్ తెలిపారు. వీరికోసం రూ.18.61 కోట్లను ఆయా సచివాలయాల సిబ్బందికి అందజేయడం జరిగిందన్నారు. అదేవిధంగా 1,74,520 మంది పెన్షన్‌దారులకు రూ.52.35 కోట్లను వారి బ్యాంకు ఖాతాలకు జమచేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు.

నేడు ఎన్నికల ఎగ్జిట్ పోల్స్

అమలాపురంటౌన్, మే31: ఎన్నికల ఫలితాలు వెలువడడానికి ఇంకా నాలుగు రోజుల సమయం ఉంది. ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలతోపాటు గుంబనంగా ఉన్న ప్రజలు సైతం ఎగ్జిట్ పోల్స్ విడుదల కోసం ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల చివరి విడత పోలింగ్ శనివారం సాయంత్రంతో ముగుస్తుంది. ఎన్నికల కమిషన్ తాజాగా జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం సాయంత్రం ఆరున్నర తర్వాతే ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు విడుదల చేసుకోవాలని నిబంధన విధించింది. ఆ తర్వాత ఏ క్షణమైనా ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు విడుదల కానున్నాయి. ఎన్నో సంస్థలు చేసిన ఎగ్జిట్ పోల్స్ సర్వే ఫలితాలెలా ఉండబోతుందోనని ఆసక్తితో జిల్లా ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఎగ్జిట్ పోల్స్ ఫలితాల్లో నిజమెంత అబద్ధమెంత తెలియాలంటే 4వ తేదీ వరకు ఆగాల్సిందే. దేశంలో ఎన్డీయే కూటమి హ్యాట్రిక్ కొట్టబోతుందా లేక దీర్ఘకాలంగా అధికారానికి దూరంగా ఉన్న ఇండియా కూటమి విజయం సాధిస్తుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా చంద్రబాబు నాల్గోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారా లేక వైనాట్ 175 అంటూ ఎన్నికల బరిలోకి దిగిన జగన్ మళ్లీ అధికారంలోకి వస్తారా దీనిపై ఎగ్జిట్ పోల్స్ ఎలా ఉండబోతున్నాయోనని ఉత్సుకత అందరిలోనూ ఉంది. ఇక కోనసీమ జిల్లాలో గెలిచేది ఎవరు, ఓడేది ఎవరో వాస్తవ ఫలితాలు రావడానికి నాలుగు రోజుల సమయం ఉంది. అయినాసరే యువతతోపాటు అన్ని వర్గాలవారు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు ఎలా ఉండబోతాయోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. శనివారం రాత్రి నుంచే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ న్యూస్ చానల్స్ సైతం ఎగ్జిట్ పోల్స్‌తో ఊదరగొట్టనున్నాయి. జిల్లాకు సంబంధించి అమలాపురం లోక్‌సభ స్థానంతోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. కూటమి తరఫున పోటీ చేసిన టీడీపీ లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ విజయం నల్లేరు మీద నడకేనని ఇప్పటికే ఆయా పార్టీల నాయకులే కాదు ప్రతిపక్షాలు సైతం అంగీకరించడం విశేషం. హరీష్‌కు వచ్చే మెజార్టీపైనే జిల్లాలో తీవ్ర చర్చ జరగడంతోపాటు పందాలు జోరుగా సాగుతున్నాయి. లక్ష దాటి మెజార్టీ అని కొందరు, రెండు లక్షలు దాటి మెజార్టీ ఉంటుందని మరికొందరు పందాలు కాస్తున్నారు. రెండు లక్షలు మెజార్టీ వస్తే జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలు క్లీన్ స్వీప్ సాధించడం ఖాయమంటున్నారు. అయితే సంక్షేమ పథకాలు పొందిన మహిళలు, అన్నివర్గాల ప్రజలు మావైపే ఉన్నారన్న పూర్తి విశ్వాసంతో వైసీపీ శ్రేణులు ఉన్నాయి. పోలింగ్ కేంద్రాల్లో నిశబ్ద పోరు జరిగిందని అందువల్ల వైసీపీకే విజయవకాశాలు ఎక్కువని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నారు.



సర్వత్రా ఉత్కంఠ

ఇక ముమ్మిడివరం, కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థుల మెజార్టీపైనే ఒకటికి నాలుగింతలుపైన చెల్లించేలా పందాలు జోరుగా సాగుతున్నాయి. అయితే ఎగ్జిట్ పోల్స్‌లో ఆ రెండు స్థానాలు ఏవిధంగా ఉండబోతాయో అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జనసేన తరఫున పోటీచేసిన అభ్యర్థులు కొత్తవారైనప్పటికీ వారి విజయవకాశాలు ఎలా ఉన్నాయోనని ప్రజలంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలో నెక్ టూ నెక్ పోరు ఏయే నియోజకవర్గాల్లో జరిగిందో ఎగ్జిట్ పోల్స్ అయినా తెలుస్తుందేమోననే ఆసక్తి నెలకొంది. కూటమి నేతలు వార్ వన్‌సైడ్ అంటే వైసీపీ నాయకులు తమకే విజయవకాశాలు ఉన్నాయంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు ఎలా ఉండబోతాయోనని ఉత్కంఠ నెలకొంది.

నాడన్నారు.. నేడన్నారు..



బండారులంకలో నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణం

ఏడాదిన్నరగా నిధులు విడుదలకాక

ఎక్కడికక్కడే నిలిచిన పాఠశాలల

భవన నిర్మాణ పనులు



ఎ.వేమవరంలో నేలకే పరిమితమైన అదనపు తరగతి గదుల నిర్మాణం

అమలాపురంరూరల్, మే31: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో దశ నాడు-నేడు పనులు ఇంకా ఒక కొలిక్కి రాలేదు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు ఎప్పటికి పూర్తి అవుతాయో తెలియని పరిస్థితి. మరో 12 రోజుల్లో పాఠశాలలు తిరిగి తెరుచుకోనున్నాయి. కనీస వసతులు కూడా కల్పించలేని పరిస్థితులు జిల్లాలోని పలు పాఠశాలల్లో నెలకొని ఉన్నాయి. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే నాడు-నేడు రెండో దశ పనులు పూర్తి చేయాలని విద్యాశాఖ ఉన్నతాధికారులకు ప్రభుత్వం గత ఏడాది ఆదేశాలు జారీ చేసింది. కానీ నిధుల కొరతతో పలు పాఠశాలల్లో పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా నిలిచిపోయాయి. ఆది నుంచి నిధులు సక్రమంగా విడుదలకాకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు విమర్శిస్తున్నారు. మూడు, నాలుగైదు తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో తరగతి గదుల కొరత ఏర్పడింది. అదనపు తరగతి గదుల నిర్మాణాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం, పనులు మంజూరుచేయడం అయితే జరిగింది. కానీ నిధులు అంతంతమాత్రంగానే విడుదల చేయడంతో కొత్త విద్యా సంవత్సరంలోను విద్యార్థులు ఇరుకు గదుల్లో చదువులు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రూ.257 కోట్లతో అంచనాలు.. రూ.80 కోట్లే విడుదల

నాడు-నేడు పథకం కింద జిల్లాలో రెండో విడత 772 పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణంతోపాటు టాయిలెట్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. ఇందుకోసం రూ.257 కోట్లతో అంచనాలను రూపొందించారు. ప్రభుత్వం రూ.80 కోట్లు మాత్రమే నిధులు విడుదల చేసింది. ఇదంతా 2022లోనే జరిగిపోయింది. నిధులు సక్రమంగా విడుదల కాకపోవడంతో పలు పాఠశాలల్లో నిర్మాణ పనులు పునాదులకే పరిమితమయ్యాయి. నిధులున్నా పనులు పూర్తిచేయలేని పాఠశాలలు లేకపోలేదు. జిల్లాలో రెండో విడత విడుదలైన నిధుల్లో రూ.67 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా రూ.13 కోట్లు ఆయా పాఠశాలల బ్యాంకు ఖాతాల్లోనే ఉన్నాయి. ఆ నిధులు వినియోగించేలా అధికారులు కసరత్తు చేపట్టారు.



రూ.1.01 కోట్ల పనులకు 2022లో వేసిన శిలాఫలకం

శంకుస్థాపనలు సరే పనులు పూర్తయ్యేది ఉందా..

రెండో విడత నాడు-నేడు పనులకు ప్రజాప్రతినిధులు ఎక్కడికక్కడ అట్టహాసంగా శంకుస్థాపనలు చేశారు. 2023 మార్చి ప్రథమార్థంలో ప్రభుత్వం కొంతమేర నిధులు విడుదల చేసింది. రెండో విడతగా నాడు-నేడు కింద విడుదలైన నిధులతో జిల్లాలో ఏ పాఠశాలకు వెళ్లినా అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు, పునాదులు దశ దాటని పాఠశాలల భవన నిర్మాణాలు దర్శనమిస్తున్నాయి. నాడు-నేడు పథకం పనులపై ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నారు తప్ప నిధులు విడుదల చేయకపోవడంతో అసంపూర్తిగానే పనులు మిగిలిపోయాయని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎ.వేమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నాడు-నేడు పథకం కింద రూ.83 లక్షలు మంజూరు చేశారు. 2022 సెప్టెంబరు 2న మనబడి నాడు-నేడు-ఫేజ్2లో భాగంగా రూ.1.01 కోట్లతో వివిధ పనులకు మంత్రి పినిపే విశ్వరూప్ శంకుస్థాపన చేశారు. ఐదు అదనపు తరగతి గదుల నిర్మాణంతోపాటు ఇతర పనులు చేపట్టాల్సి ఉంది. ప్రభుత్వం రూ.25 లక్షలు నిధులు విడుదల చేయడంతో కొద్దిపాటి పనులుచేసి అలాగే వదిలేశారు. ప్రస్తుతం అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపడదామంటే సిమెంటు సరఫరా చేయడం లేదు. గతేడాది మార్చి 14న ఈ నిధులు విడుదల అయ్యాయని అప్పటి నుంచి ఇప్పటివరకు నిధులు విడుదల కాకపోవడంతో అదనపు తరగతి గదుల నిర్మాణం పుట్టింగుల స్థాయిలోనే భూమికే పరిమితమైపోయింది. ఇక ఇందుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.1.30 కోట్లు మంజూరుచేశారు. అప్పట్లో రూ.23 లక్షలు మంజూరు చేశారు. ఆరు అదనపు తరగతి గదులతోపాటు తొమ్మిది విభాగాల్లో ఇతర పనులు చేపట్టాల్సి ఉంది. అదనపు తరగతి గదుల నిర్మాణం పునాదుల దశలోనే నిలిచిపోతే బాలికల టాయిలెట్లు, వంట షెడ్ల నిర్మాణాల పనులు జరుగుతున్నాయి. బండారులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండో విడత మంజూరైన నిధులతో అసంపూర్తిగా అదనపు తరగతి గదుల నిర్మాణం దర్శనమిస్తోంది. ఇక అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోను అదే పరిస్థితి. ఇలా జిల్లాలో ఏ పాఠశాలకు వెళ్లినా అసంపూర్తి భవన నిర్మాణాలే దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి భవన నిర్మాణాలు పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.





ఇందుపల్లిలో పునాదుల దశలోనే అదనపు తరగతి గదులు.. అసంపూర్తిగా నిలిచిపోయిన బాలికల టాయిలెట్లు

కౌంటింగ్ ఏజెంట్లు సత్ప్రవర్తనతో మెలగాలి

జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా

అమలాపురం టౌన్, మే 31: ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు కౌంటింగ్ ఏజెంట్లు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షుశుక్లా పేర్కొన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపులో కౌంటింగ్ ఏజెంట్లకు స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో జూన్ 4న ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, అధికారులు, సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం ఆరు గంటలకల్లా రిపోర్టు చేయాలన్నారు. ఆర్వో ఆదేశాలను తరచూ అతిక్రమించే ఏజెంట్లను బయటకు పంపించే అధికారం రిటర్నింగ్ అధికారికి ఉందన్నారు. తుది ఫలితాలు ప్రకటించిన తరువాత మాత్రమే ఏజెంట్లు బయటకు వెళ్లాలన్నారు. రౌండ్ల వారీ ఓట్ల నివేదికలపై కౌంటింగ్ ఏజెంట్లు తప్పనిసరిగా సంతకాలు చేయాలని అన్నారు.



బలుసుతిప్పలో బెల్లపు ఊట ధ్వంసం చేస్తున్న పోలీసులు

అవాంచనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు : జిల్లా ఎస్పీ

అమలాపురం టౌన్, మే31: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో భాగంగా జిల్లాలో ఎవరైనా అవాంచనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ హెచ్చరించారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కౌంటింగ్ రోజున జిల్లాలో సంఘ విద్రోహశక్తులు, అల్లరిమూకలు రోడ్డెక్కితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం సాయుధ బలగాలతో సిద్ధంగా ఉందని చెప్పారు. మండపేటలో శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించామని, అలాగే కాట్రేనికోన మండలం బలుసుతిప్పలో అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, సీఐ ఎన్.కొండయ్య, ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావుల బృందం ఆకస్మిక దాడులు నిర్వహించి 1600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు తెలిపారు. ఓట్ల లెక్కింపు దృష్ట్యా జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలతో సమావేశాలు నిర్వహించామని, 144 సెక్షన్ అమలులో ఉన్నందున కౌంటింగ్ రోజున ఇళ్లవద్దే ఉండి టీవీలో ఎన్నికల ఫలితాలు చూసుకోవాలని ఎస్పీ వివరించారు.



మహిళల ఆధ్వర్యంలో తిరుచ్చి పల్లకీ సేవ

బండారులంక శ్రీపద్మావతి అలివేలు మంగ సమేత వెంకటేశ్వరస్వామి తీర్థ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిళల ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా తిరుచ్చి పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యమిది.. - 8లో

అటు ఎండలు.. ఇటు కరెంటు కోతలు

నరకం చూస్తున్న మండపేట ప్రజలు.. వృద్ధులు, చిన్నారుల పరిస్థితి మరీ దారుణం

మండపేట, మే31 : మండే ఎండల ఉక్కబోత, మరోపక్క పగలు రేయి తేడాలేకుండా వేళాపాళాలేని విద్యుత్ కోతలతో ప్రజలు సతమతమవుతున్నారు. గురువారం రాత్రి విద్యుత్ గంటలు తరబడి లేకపోవడంతో మండపేట పట్టణ ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు పాట్లు వర్ణాతీతంగా మారాయి. విద్యుత్ కోతలతో ఇళ్లల్లో ఉండే ఇన్వర్టర్‌లు కూడా పనిచేయడం లేదు. అలాగే ఎన్నికల నేపథ్యంలో బయట పెట్రోలు బంకుల్లో లూజు డీజిల్, పెట్రోల్‌ను విక్రయించరాదన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు బంకుల్లో డీజిల్, పెట్రోల్ కొట్టటం లేదు. దాంతో జనరేటర్‌లు తిరిగే దారిలేదు. అలాగే అత్యవసర సేవలు అందించే ఆసుపత్రుల్లో కూడా జనరేటర్‌లు పనిచేయని పరిస్థితులు నెలకొన్నాయి. మరోపక్క విద్యుత్ ధరలు పెంపు, సర్‌చార్జీల పేరిట వినియోగదారులపై ఎడాపెడా చార్జీలను వసూలుచేసే విద్యుత్‌శాఖ వేసవిలో విద్యుత్ కోత పేరిట దారుణంగా విద్యుత్‌కోతలు విధించటం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పగలంతా మండే ఎండలతో బాధపడుతూ సాయంత్రం వేళ కాస్తంత రాత్రికి ఇంటి వద్ద సేదతీరుదామంటే ఎప్పుడు కరెంట్ ఉంటుందో, ఎప్పుడు సరఫరా ఆగిపోతుందో తెలియని అయోమయ పరిస్థితుల్లో వినియోగదారులు ఉన్నారు. మరోపక్క విద్యుత్ కోతల వేళ కరెంట్ ఎప్పుడు వస్తుందో చెప్పేందుకు విద్యుత్ సిబ్బంది కనీసం ఫోన్ ఎత్తి సమాధానం కూడా ఇవ్వడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇక పగలు కూడా విద్యుత్ కోతలతో చిరువ్యాపారులు, చిన్నచిన్న పనులు చేసుకునేవారు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొత్తం మీద మండుతున్న ఎండలకు తోడు విద్యుత్ కోతలు తోడవడంతో కంటిమీద కునుకులేక మరోపక్క కరెంట్ లేక చిన్న పరిశ్రమలు వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండే ఎండలకు ఉదయం పది గంటలకే రోడ్డుపై ప్రజలు తిరగడం లేదు. మొత్తం మీద మండే ఎండలతో ప్రజలు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సరఫరాలో నిరంతరం కోతలను లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు విద్యుత్ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మత్స్యకారుల మృతి

బోలెరో వ్యాన్‌ను ఢీకొట్టిన బియ్యం లోడు ట్రాక్టర్

మరో ముగ్గురికి గాయాలు

చేపలవేటకు బయలుదేరిన పది నిమిషాలకే ప్రమాదం

- 7లో

కౌంటింగ్‌కు హాజరయ్యేందుకు వీలుగా వసతి ఎంపిక

అటు ఏజెంట్లు, అభిమానులు.. ఇటు అభ్యర్థులు, ముఖ్య నేతలు బస చేసేందుకు అందుబాటులో ఏర్పాట్లు

ముమ్మిడివరం, మే 31: జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపునకు సంబంధించి రాజకీయ పార్టీల నేతలు, ఏజెంట్లు, అభిమానులు, అభ్యర్థులు బసచేయడానికి వీలుగా ముమ్మిడివరంలోని పలు ప్రైవేటు భవనాలు, గెస్ట్‌హౌస్‌లను ఎంపిక చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. 4వ తేదీన ఉదయం ఏడు గంటలకే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభంకానుండడంతో ఆరుగంటలకే ఏజెంట్లు, అభ్యర్థులు కౌంటింగ్ కేంద్రానికి హాజరుకావాల్సి ఉంది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియ చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన విషయం విదితమే. ఉదయమే కౌంటింగ్‌కు హాజరయ్యేందుకు వీలుగా అభ్యర్థులు ఈ ఏర్పాట్లు చేపట్టారు. కొత్తపేట నియోజకవర్గ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు ముమ్మిడివరం టీటీఆర్ నగర్‌లోని తాడి నరసింహారావు స్వగృహాన్ని ఎంపిక చేసుకున్నారు. పి.గన్నవరం కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ ముమ్మిడివరం టీటీఆర్ నగర్‌లోని ప్రైవేటు నివాస గృహాన్ని అభ్యర్థి బస చేయడానికి, ఏజెంట్లు, అభిమానులకు రాజుపాలెంలోని జగతా చంటి నివాసం గృహాన్ని ఎంపిక చేసుకున్నారు. మండపేట నియోజకవర్గ కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు కొమనాపల్లిలోని వెత్సా ధ్రువరాజు ప్రైవేటు గెస్ట్‌హౌస్‌ను ఎంపిక చేసుకోగా వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులు ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల లేఅవుట్‌లోని దేశంశెట్టి బెనర్జీ నివాస గృహాన్ని ఎంపిక చేసుకున్నారు. ముమ్మిడివరం కూటమి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు లోకల్ కావడంతో స్థానిక పార్టీ కార్యాలయాన్ని ఏజెంట్ల కోసం ఎంపిక చేసుకున్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు, అభిమానులు ఆరోజు ఉండడానికి వీలుగా అవసరమైన సౌకర్యాలు కల్పించడంపై పార్టీ శ్రేణులతో కలిసి ఏర్పాట్లు సమీక్షిస్తున్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు, దాట్ల బాబులతో కలిసి గిడ్డి సత్యనారాయణ ఇప్పటికే ఎంపిక చేసిన నివాసగృహాలను పరిశీలించారు.

ఎండలకు గుడ్లు తేలేస్తున్న కోళ్లు



మండపేట మండలం ద్వారపూడిలో మండే ఎండలకు తాళలేక చనిపోయిన కోళ్లు

మండపేట, మే 31: మండుతున్న ఎండలు ఇటు జనంపైనే కాదు, అటు పశుపక్ష్యాదులపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తట్టుకోలేక కోళ్లఫారాల్లో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. మండపేట మండలం ద్వారపూడి, కేశవరం, అర్తమూరు గ్రామాల్లో ఉన్న ఫారాల్లో కోళ్లు మండుతున్న ఎండలకు గుడ్లు తేలేస్తున్నాయి. ఇప్పటికే ఎండల దెబ్బకు మేతలు తినకపోవడం, గుడ్ల ఉత్పత్తి తగ్గడంతోపాటు వేసవిలో వేడిని తట్టుకోలేక నిత్యం ఫారాల్లో కోళ్లు భారీ సంఖ్యలో మరణించడం రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తోంది. ఉష్ణోగ్రతలను తట్టుకునేందుకు పలు చర్యలు తీసుకున్నప్పటికీ కోళ్ల మరణాలు తగ్గడం లేదని రైతులు వాపోతున్నారు. ఇవే ఎండలు కొద్దిరోజులపాటు ఉంటే కోళ్ల పరిశ్రమకు తీవ్ర నష్టం తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలకరి పలకరించి వర్షం కురిస్తే ఎండలు తగ్గుముఖం పట్టి కోళ్ల మరణాలు తగ్గు ముఖం పట్టే అవకాశం ఉందని ఆయా రైతులు చెబుతున్నారు. మొత్తం మీద ఈ వేసవి కోళ్ల రైతులను బెంబేలెత్తిస్తోంది.

సినీ దర్శకుడు బుచ్చిబాబు తండ్రి అంత్యక్రియలు

- 7లో

సినీ డైరెక్టర్ సుకుమార్ పరామర్శ



గుడిసె విహార కేంద్రం

అటవీ అధికారుల దోపిడీ

- గుడిసె ఏకో టూరిజం ప్రాజెక్టు నిధుల్లో చేతివాటం
- కమిటీ లేకుండానే సీబీఈటీ కార్యకలాపాలు
- ఆకుమామిడికోటలో అనధికార చెక్‌పోస్టు

రమ్యమైన దుఃఖాన్ని సైతం మరిపించేది ప్రకృతి! ఈ ప్రకృతినే విహారం పేరుతో ఎరగా వేసి అటవీ అధికారులు పర్యాటకులను ఆకర్షించి, తద్వారా వచ్చే ఆదాయాన్ని తమ చేతివాటంతో దోచేయడం రంపచోడవరం అటవీ డివిజన్లో ప్రహసనంగా సాగుతోంది. రంపచోడవరం డివిజన్లోని పలు రేంజిల పరిధిలో పర్యాటకం కోసం పలు కమ్యూనిటీ బేస్డ్ ఏకో టూరిజం(సి.బి.ఇ.టి) ప్రాజెక్టులు నడుస్తున్నాయి. అందులో కీలకంగా మారేడుమిల్లి రేంజి పరిధిలోని గుడిసె, మారేడుమిల్లి, వాలమూరు గొంది సీబీఈటీల ద్వారానే పర్యాటకుల నుంచి ఆదాయం సమకూరుతోంది. ఇందులో గుడిసె సీబీఈటీకి పర్యాటకుల తాకిడితో పాటు ఆదాయమూ ఎక్కువే! ఈ సీబీఈటీ కార్యకలాపాల నిర్వహణలో సంబంధిత అటవీ అధికారుల తీరుపై అనేక ఆరోపణలు వస్తున్నాయి.

(రంపచోడవరం/మారేడుమిల్లి)

ముఖ్యంగా గుడిసె ఏకో టూరిజం ప్రాజెక్టు నిర్వహణ చుట్టూనే అనేక ఆరోపణలు తిరుగుతున్నాయి. సీబీఈటీలకు గిరిజనులే సభ్యులుగా కమిటీలను ఏర్పాటు చేసి వాటి ద్వారానే వాటి నిర్వహణ సాగించడం నిబంధన. ఈ ప్రకారం గుడిసె సీబీఈటీకి కమిటీని నియమించడం, కమిటీ ఛైర్మన్‌తో కలిపి ఇద్దరికీ జాయింట్ ఖాతాను మారేడుమిల్లిలోని యూనియన్ బ్యాంకులో ఖాతాను కూడా తెరిచారు. గుడిసె సీబీఈటీకి ఉన్న కమిటీని అక్టోబరు 2023లో అటవీ అధికార్లు రద్దు చేశారు. నేటికీ కొత్త కమిటీని నియమించకుండానే అధికారులే సీబీఈటీ కార్యకలాపాలను నిర్వహించడం వివాదాస్పదంగా మారింది. గుడిసె విహారానికి వచ్చే పర్యాటకుల నుంచి అధికారికంగా కొంత అనధికారికంగా కొంత సొమ్ములను వసూలు చేస్తున్నారు. అధికారికంగా వసూలుచేసిన సొమ్ములను బ్యాంకు ఖాతాల్లో వేయడం, ఆనక ఆ ఖాతా నుంచి సొమ్ములను డ్రా చేయడం సాగింది. ఈ విధంగా లక్షలాది రూపాయలను గత ఏడు నెలలుగా డ్రా చేశారని సమాచారం. కమిటీ లేకుండా బ్యాంకు ఖాతా నుంచి సొమ్ములను ఎలా డ్రా చేస్తున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఆకుమామిడికోటలో చెక్‌పోస్టు

ఇక గుడిసె విహారయాత్రికులను క్రమబద్ధీకరించి రుసుము వసూలు చేసేందుకు



ఆకుమామిడికోటలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు

సమీపంలోనే చెక్‌పోస్టును నిర్వహించేవారు. గతంలో రాజమండ్రి అటవీశాఖ సీసీఎఫ్ ఇక్కడకు పర్యటనకు వచ్చిన సమయంలో ఈ చెక్‌పోస్టును ఎత్తేయాలని ఇక్కడి అటవీ అధికారులకు సూచన చేశారు. ఆ మేరకు చెక్‌పోస్టును ఎత్తేశారు కూడా! తదనంతర కాలంలో గుడిసెకు 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆకుమామిడికోటలో చెక్‌పోస్టును ఏర్పాటుచేసి గుడిసెకు వచ్చే విహారయాత్రికుల నుంచి రుసుములు వసూలు చేస్తున్నారు. కానీ ఆకుమామిడికోటలో ఈ చెక్‌పోస్టు ఏర్పాటుకు సీసీఎఫ్ నుంచి ఎటువంటి అనుమతులూ లేవని సమాచారం. ఇదే నిజమైతే ఈ చెక్‌పోస్టు ద్వారా గుడిసె పర్యాటకుల నుంచి అనధికారికంగానే రుసుములు వసూలు చేస్తున్నట్టే! ఇదిలావుండగా ఈ ప్రాంతమంతా గిరిజన ప్రాంతం కావడం, అటవీ హక్కుల చట్టం పరిధిలోనిది కావడంతో గిరిజనులకు ఉన్న సామాజిక హక్కుల నేపథ్యంలో అటవీశాఖ అధికారులు సాగిస్తున్న ఈ కార్యకలాపాలకు సంబంధించి పుల్లంగి పంచాయతీలో పీసా గ్రామసభ అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారన్న విమర్శలూ వ్యక్తమవుతున్నాయి.

రాజమహేంద్రవరం తపాలా డివిజన్‌కి 10 అవార్డులు

రాజమహేంద్రవరం, మే 31(ఆంధ్రజ్యోతి): 2023-24 ఆర్థిక సంవత్సరంలో వివిధ విభాగాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన రాజమండ్రి తపాలా డివిజన్‌కి 10 అవార్డులు దక్కాయని సూపరింటెండెంట్ కె.శేషారావు తెలిపారు. విశాఖపట్నంలో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డులు అందుకోవడం జరిగిందన్నారు.

జీఎస్‌ఎల్‌లో నెలరోజులు ఉచిత వైద్య సేవలు

రాజానగరం, మే 31: నేటి నుంచి జీఎస్‌ఎల్ జనరల్ ఆసుపత్రిలో నెల రోజులపాటు(జూన్1 నుంచి జూలై 1)వ తేదీ వరకు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్టు జీఎస్‌ఎల్ వైద్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీఎస్‌ఎల్ మెడికల్ కళాశాల ప్రారంభించి రెండు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా కృతజ్ఞతా పూర్వకంగా నెల రోజులపాటు అన్నిరకాల టీ వైద్యసేవలు, మెడికల్ ప్రొసీజర్లు, సర్జరీలు ఉచితంగా చేస్తామని, నెలరోజులు మెడికల్ టెస్టులు, ఇన్వెస్టిగేషన్ల ఫీజుల్లో 50శాతం తగ్గిస్తామన్నారు. మందులు మాత్రం పేషెంట్లే కొనుగోలు చేసుకోవాలన్నారు. తమ సంస్థలైన రాజానగరం జీఎస్‌ఎల్ జనరల్ ఆసుపత్రి, రాజమహేంద్ర వరంలోని స్వతంత్ర ఆసుపత్రి, కేన్సర్ ఆసుపత్రిలో ఉచిత వైద్యం, డిస్కౌంట్‌పై వైద్య సేవలు అందజేస్తామన్నారు. ఆరోగ్యశ్రీ పరిధి లో ఉన్నవారికి యథావిధిగా ఉచిత వైద్యం అందుతుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకో వచ్చని డాక్టర్ గన్ని భాస్కరరావు పేర్కొన్నారు.

సినీ దర్శకుడు బుచ్చిబాబు తండ్రి అంత్యక్రియలు

కొత్తపల్లి, మే 31: ప్రముఖ చలన చిత్రదర్శకుడు సానా బుచ్చిబాబు తండ్రి వెంకట్రావు హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ గురువారం మరణించారు. శుక్రవారం ఆయన భౌతికకాయాన్ని కాకినాడజిల్లా కొత్తపల్లి మండలానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. విషయాన్ని తెలుసుకొన్న సినీ డైరెక్టర్, బుచ్చిబాబు గురువు సుకుమార్ కొత్తపల్లి వచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పితృ వియోగంతో బాధపడుతున్న బుచ్చిబాబును డైరెక్టర్ సుకుమార్ ఓదార్చారు.



కొత్తపల్లిలో బుచ్చిబాబు తండ్రి అంత్యక్రియల్లో దర్శకుడు సుకుమార్





ఛత్తీస్‌గఢ్ - ఏపీ రాష్ట్రాల సరిహద్దున ప్రధాన రహదారిపై బైటాయించిన ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక కమిటీ

ఐదు మాసాల్లో 120 మంది ఆదివాసీల హత్య

- నిజ నిర్ధారణ కమిటీని అడ్డుకున్న పోలీసు బలగాలు
- బెదిరింపులు, బుజ్జగింపులు
- రాజ్యం పోలీసుల నిర్బంధఖాండను ఖండిద్దాం
- ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక స్టీరింగ్ కమిటీ ఆరోపణ

చింతూరు, మే 31 : ఛత్తీస్‌గఢ్‌లో గత ఐదు మాసాలుగా మారణ ఖాండ జరుగుతోందని ఈ క్రమంలో మావోయిస్టుల ముద్రవేసి 120 మంది ఆదివాసీలను పోలీసు బలగాలు హత్య చేశాయని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆరోపించింది. ఈ మేరకు కమిటీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక నేతృత్వంలో 60 మందితో కూడిన నిజనిర్ధారణ కమిటీ గురువారం తెలంగాణ మీదుగా ఛత్తీస్‌గడ్ చేరుకొని అక్కడి బాధిత కుటుంబాలను కలిసే ప్రయత్నం చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ నారాయణరావు, మాదన కుమార స్వామి, జాబిలి (తెలంగాణ) నాయకత్వంలో బయలుదేరిన బృందాన్ని తెర్లగూడ వద్ద పోలీసు బలగాలు అడ్డుకున్నారన్నారు. భద్రతా కారణాలను సాకుగా చూపి వెనుతిరిగి వెళ్లాల్సిందిగా హెచ్చరించినట్లు ఆ ప్రకటనలో ఆరోపించారు. తామంతా ప్రయాణంతో అలసిపోయామని బీజాపూర్ చేరుకొని అక్కడ విశ్రాంతి తీసుకుంటామని ఎంతగా నచ్చచెప్పినా తమ మాటను పెడచెవిన పెట్టిన బలగాలు బెదిరింపులకు దిగాయని ఆరోపి ంచారు. చివరకు కమిటీని భద్రాచలం తిప్పి పంపారన్నారు. దీంతో శుక్రవారం వయా చింతూరు మీదుగా దంతెవాడ చేరుకునేందుకు చేసిన ప్రయత్నాన్ని కుంట సరిహద్దున బలగాలు అడ్డుకోవడంతో పాటు తమను పారా మిలటరి బలగాలు చుట్టుముట్టాయన్నారు. దీంతో తాము రోడ్డుపైనే బైటాయించామని తెలిపారు. బలగాలు బుజ్జగించడం మొదలుపెట్టాయ న్నారు. ఛత్తీస్‌గడ్‌లో తరచూ కాల్పులు జరుగుతున్నాయని అక్కడకు వెళ్లడం సరికాదంటూ బలగాలు చెప్పాయన్నారు. చివరకు అక్కడి నుంచి కూడా తమను వెనక్కు తిరిగి పంపారన్నారు. ఛత్తీస్‌గడ్‌లో జరుగుతున్న మారణఖాండను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, హక్కులను బలగా లు ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని కమిటీ తీవ్రంగా ఖండించింది. తమను ఛత్తీస్‌గడ్‌లోకి అనుమతించాల్సిందిగా వారు డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో

ఇద్దరు మత్స్యకారుల మృతి

- బొలెరో వ్యాన్‌ను ఢీకొట్టిన బియ్యం లోడు ట్రాక్టర్
- మరో ముగ్గురికి గాయాలు
- చేపలవేటకు బయలుదేరిన పది నిమిషాలకే ప్రమాదం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సూరిబాబు, సాయిబాబు



గుమ్మిలేరు వద్ద వ్యాన్, ట్రాక్టర్ ఢీకొట్టుకున్న దృశ్యం

ఆలమూరు, మే 31: చెరువులో చేపల వేటకు బయలదేరిన పది నిమిషాలకే వారు వెళుతున్న బొలెరా వ్యాన్‌ను ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ శుక్రవారం తెల్లవారుజామున ఢీకొట్టడంతో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరువద్ద జరిగిన ఈరోడ్డు ప్రమాదంలో ఆలమూరు గ్రామానికి చెందిన లంకే సూరిబాబు(49), వనమాడి సాయిబాబు (59), కొప్పాడి రమణ, డొక్కాడి శ్రీనివాస్, వనమాడి మావుళ్లస్వామి బొలెరా వ్యాన్‌లో రాజానగరం మండలం తుంగపాడు గ్రామంలోని చెరువులో చేపలవేటకు తెల్లవారుజామున బయలుదేరారు. ఆలమూరు నుంచి బయలుదేరిన పది నిమిషాలలో గుమ్మిలేరు సమీపంలో మండపేట నుంచి ఆలమూరు వైపు వస్తున్న రేషన్‌బియ్యంలోడు ట్రాక్టర్ బలంగా ఢీకొట్టింది. దీంతో వ్యాన్‌లో ఉన్న సూరిబాబు, సాయిబాబులు అక్కడికక్కడే మృతి చెందారు. వ్యాన్‌లో ప్రయాణిస్తున్న రమణ, శ్రీనివాస్, మావుళ్లస్వామిలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన వారిని ప్రథమ చికిత్స నిమిత్తం ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. మృతదేహలను మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఆలమూరు ఎస్‌ఐ శ్రీనునాయక్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలమూరులో విషాదఛాయలు



లంకే సూరిబాబు

వనమాడి సాయిబాబు



బతుకుతెరువులో భాగంగా తెల్లవారుజామునే ఇంటి నుంచి వ్యాన్‌లో వలలు వేసుకుని చెరువులలో చేపల వేటకు ఆలమూరు మత్స్యకారులు వెళుతుంటారు. దీనిలో భాగంగానే ఐదుగురు మత్స్యకారులు బొలెరావ్యాన్‌లో ఆలమూరు నుంచి రాజానగరం మండలం తుంగపాడు గ్రామంలోని చెరువులో చేపలవేటకు వెళుతుండగా జరిగిన ప్రమాదంలో ఇంటి నుంచి బయలుదేరిన పది నిమిషాల వ్యవధిలోనే ఇద్దరు మృత్యువాతపడ్డారు. ఈప్రమాదంలో లంకే సూరిబాబు, వనమాడి సాయిబాబు మృతి చెందారు. మృతి చెందిన సూరిబాబుకు భార్య, కుమార్తు, కుమార్తె ఉన్నారు. మరో మృతుడు సాయిబాబుకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈప్రమాదంలో మరో ముగ్గురుకి తీవ్ర గాయాలయ్యాయి. ఆలమూరు మత్స్యకారుల కాలనీతో తీవ్ర విషాదం నెలకొం ది. మృతుల కుటుంబాలు, బంధువులు బోరున విలపిస్తున్నారు.

అనుమానాస్పద మృతిపై వీడిన మిస్టరీ

- మద్యంమత్తులో హత్య

తునిరూరల్, మే 31: ఇటీవల కాకినాడజిల్లా తునిలో సీఎంఆర్ షాపింగ్ మాల్ ఎదురుగా రైల్వే ప్రహరీగోడ అనుకుని వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన కేసును పోలీసులు చేధించారు. ఈ వివరాలను తుని సీఐ సీతారామకృష్ణ వెల్లడించారు. తుని రైల్వేట్రాక్‌పై దేవుడురాజు బెగ్గింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నిందితుడు యడ్ల అప్పారావు ఇరువురికి పరిచయం ఉంది. అప్పారావు రైళ్లలో ఖైనీలు, సిగరెట్లు అమ్ముతూ జీవనం సాగించేవాడు. తునిలో రైలు దిగిన ప్రతీసారీ దేవుడు రాజుతో కలిసి మద్యం తాగేవాడు. మే 25న ఇద్దరు కలిసి మద్యం తాగి డబ్బుల విషయంలో గొడవపడి అప్పారావు దేవుడురాజును ముఖం మీద కొట్టి కాళ్లతో తన్ని, తలను రోడ్డుకేసి గుద్దడంతో మృతి చెందాడు. దేవుడు రాజును అక్కడే వదిలేసి యడ్ల అప్పారావు యలమంచిలి వెళ్లిపోయాడు. దీంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. నిందితుడిని గుర్తించి పట్టుకున్న తుని టౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్స్ కె.రాజాభూషణం, ఎం.నాగేశ్వరరావులను సీఐ అభినందించారు.

మాస్ మూవీ దేవకీ నందన వాసుదేవ

- హీరో అశోక్ గల్లా, దర్శకుడు అర్జున్ జంధ్యాల, నిర్మాత బాలకృష్ణ సోమినేని



సమావేశంలో మాట్లాడుతున్న హీరో అశోక్ గల్లా

రాజమహేంద్రవరం సిటీ, మే31 : దేవకీ నందన వాసుదేవ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని హీరో అశోక్ గల్లా, దర్శకుడు అర్జున్ జంధ్యాల ,నిర్మాత బాలకృష్ణ సోమినేని అన్నారు. రాజమహేంద్రవరం హోటల్ షెల్టాన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హనుమాన్ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే ,దర్శకత్వం చేసిన ప్రశాంత్ వర్మ అందించిన కథతోనే ఈ సినిమా తెరకెక్కించినట్టు చెప్పారు. అశోక్ గల్లా మాట్లాడుతూ సూపర్ స్టార్ కృష్ణ ఆశీస్సులతో ఆయన పుట్టిన రోజున శివజ్యోతి థియేటర్‌లో అభిమానుల సమక్షంలో దేవకీ నందన వాసు దేవ సినిమాలో కీలక పాటను విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇది మాస్ సినిమా అన్నారు. ఈ సినిమా తర్వాత తాను సితార ప్రొడక్షన్ బ్యానర్‌లో చేస్తున్నానని చెప్పారు. చిత్ర దర్శకుడు అర్జున్ జంధ్యాల మాట్లాడుతూ గుణ 369 సినిమా చేసిన తాను అశోక్ గల్లాతో సినిమా చేయడం ఆనందంగా ఉందన్నారు. సంగీత దర్శకుడు బీమ్స్ సిసిరోలియా మాట్లాడుతూ ఈ ప్రాంతంలోనే బీఈడీ చేసి ఉపాధ్యాయుడిగా పనిచేసిన తాను సంగీత దర్శకుడిగా ఈ చిత్రానికి సంగీతం అందించి ఇక్కడే పాటను విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. పాటను పాడి అలరించారు. నిర్మాత బాలకృష్ణ సోమినేని మాట్లాడుతూ సినిమాలో విశ్రాంతి తర్వాత వచ్చే సీన్‌ను ఎవరూ ఊహించలేరని అంత గొప్పగా ఈ సినిమా ఉంటుందన్నారు. మా సినిమాలో మంచి కథ ఉంది, కథనం ఉంది. దమ్ముందని తప్పకుండా అందరినీ అలరిస్తుందన్నారు.

రైలు ఢీ కొని మహిళ మృతి



తునిరూరల్, మే 31: గొల్లప్రోలు, రావికంపాడు రైల్వే స్టేషన్ మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని 35 సంవత్సరాల వయస్సుగల మహిళ మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు జరిగిన ఈ ఘటనను పోలీసులు పరిశీలించగా సంబంధిత మహిళ వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. మృతురాలు ముక్కుపొడుము రంగుచీర, పింక్ కలర్ జాకెట్ ధరించి చామన ఛాయ రంగు ఉన్నట్లు తెలిపారు. మృతదేహన్ని ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచామని సంబంధించినవారు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

రాళ్లు ఢీకొని బోటు ధ్వంసం

- రూ. 4లక్షల నష్టం

ఉప్పాడ(కొత్తపల్లి) మే 31: లంగర్ తాడు తెగిపోవడంతో రాళ్లను ఢీకొన్న సంఘటనలో బోటు అడుగుభాగం ధ్వంసమైన సంఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడలో జరిగింది. ఉప్పాడ సర్పంచ్ ఉమ్మిడి మేరీజాన్ తెలిపిన వివరాలు ప్రకారం.. ఉప్పాడకు నాయకర్ కాలనీకి చెందిన ఉమ్మిడి జగన్నాధంకు చెందిన బోటును వేట నిషేధం కారణంగా స్థానిక ఉప్పుటేరు కాలువలో లంగర్ వేశాడు. శుక్రవారం సముద్రంలో వచ్చిన పోటు,పాట్లకు కెరటాల ఉధృతికి లంగర్ వేసిన బోటు తాడు తెగిపోవడంతో పక్కనేఉన్న వంతెనరాళ్లకు బోటు ఢీకొట్టింది. దీంతో అడుగుభాగం పూర్తిగా పాడైంది. ఈసంఘటనలో సుమారు రూ.4లక్షల నష్టం వాటిల్లిందని సర్పంచ్ తెలిపారు.

గుమ్ముళూరులో వ్యక్తి అనుమానాస్పద మృతి

కోరుకొండ, మే 31: మండలంలోని గుమ్ముళూరులో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్‌ఐ డి.ఆనంద్‌కుమార్ వివరాల ప్రకారం.. సీతానగరం మండలం రఘుదేవపురానికి చెందిన మాదంపూడి రమేష్(35) గుమ్ముళూరుకు చెందిన చిన్న సత్యవతిని పెళ్లి చేసుకుని అత్తింటికి వచ్చేశారు. అదే గ్రామంలో వేరే ఇంటిలో కాపురం ఉంటున్నారు. వారికి 13 ఏళ్ల కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య తగాదాలు తలెత్తాయి. రమేష్ తాగుడుకు బానిసై కుటుంబ పోషణ పట్టించుకోవడంలేదని సత్యవతి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో చికిత్స అనంతరం ఇటీవల ఇంటికి వచ్చింది. అమ్మగారి ఇంటి వద్దే ఉంటోంది. దీంతో రమేష్ ఒక్కడే తన ఇంట్లో ఉంటున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం 12గంటలకు కుమారుడు గణేష్ తన తండ్రిని చూడడానికి వచ్చాడు. ఇంట్లో వేలాడుతున్న తండ్రి మృతదేహాన్ని చూసి తల్లికి చెప్పాడు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని కిందకి దించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్‌ఐ ఆనంద్‌కుమార్ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

ఆరోగ్య ప్రదాయిని..

- రోగ నిరోధక శక్తిని పెంచే పాలు
- ఆరోగ్యవంతమైన జీవనానికి పాలే ప్రధానం
- నేడు ప్రపంచ పాల దినోత్సవం



పాడి పశువులు



పాల ఉత్పత్తుల పెంపుదలపై వివిధ దేశాలు విడుదల చేసిన నాణేలు



పాల దిగుబడిలో పోటీపడే తార్‌పార్

అమలాపురంరూరల్, మే 31: ఒకప్పుడు పాడితోనే పంట ముడిపడి ఉండేది. అందుకే పాడిపంటలు అనేవారు. పాడి నుంచి ప్రకృతి సిద్ధంగా లభించే పెంటే ఎరువుగా పంటలు పండించేవారు. ఎటువంటి ఎరువులు, పురుగుమందులు వినియోగించేవారు కాదు. దాంతో ఆరోగ్యవంతమైన పంటలను రైతులు పండించేవారు. ఆరోగ్యవంతమైన పంట దిగుబడులతో రోగరహితంగా ప్రజలు ఒకప్పుడు జీవించారనడంలో ఎంతమాత్రం అతిశయోక్తికాదు. ఆధునిక సమాజం పాడినుంచి పంటను దూరం చేస్తుంది. పాడి పెంపకానికి అవసరమైన గడ్డి కూడా దొరకని పరిస్థితికి వ్యవసాయ యాంత్రీకరణ విధానాలు అందుబాటులోకి వచ్చేశాయి. వేలకు వేలు చెల్లించినా ఎండుగడ్డి దొరకని పరిస్థితి ఏర్పడింది. దాంతో పాడి పెంపకమంటేనే రైతులు భయపడిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీని ప్రభావం పాల ఉత్పత్తులపై తీవ్రంగా పడింది. పెరిగిన జనాభాకు అనుగుణంగా పాల ఉత్పత్తులు ఏనాడో తగ్గిపోయాయి. పాడిపంటల్లో ముందుండే కోనసీమ వంటి ప్రాంతాల్లోనే పాలను దిగుమతి చేసుకునే దుస్థితి ఏర్పడింది. దానికితోడు పాలపొడితో, కల్తీ పాలతో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ఆరోగ్యవంతమైన పాల దిగుబడులు కోసం ఐక్యరాజ్యసమితి నడుం బిగించింది. ప్రపంచ ఆహారసంస్థ ఆధ్వర్యంలో ప్రతిఏటా జూన్1న ప్రపంచ పాలదినోత్సవాన్ని నిర్వహించాలని ప్రకటించింది.

శ్రేష్ఠమైన ఆహారం పాలు

సృష్టిలో శ్రేష్ఠమైన ఆహారంగా మొదట చెప్పుకునేది పాలనే. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, ఒంటెలు, గాడిదలు..ఇలా క్షీరదజాతి పాడిపశువులు, జంతువులు పాల ఉత్పత్తులకు ముఖ్య వనరులుగా ఉన్నాయి. అనేక జబ్బులను తగ్గించుకునేందుకు, రోగ నిరోధక శక్తిని పెంచుకునేందుకు వందలాది రూపాయలు వెచ్చించి గాడిద పాలు కొనుగోలుచేసి తాగుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆరోగ్యవంతమైన జీవనానికి పాలే ప్రధానంగా నిలుస్తాయి. పాలలో ఆరోగ్యానికి అవసరమైన ప్రొటీన్లు, కొవ్వులు, విటమిన్లు ఇతర పదార్థాలు పుష్కలంగా ఉండటంవల్ల సమీకృత ఆహా రంగా పాలను ప్రకటించారు. రోగనిరోధక శక్తిని పెంపొందింపజేయడంతోపాటు తక్షణశక్తిని అందించేది పాలుమాత్రమే.

నెలకు 37,338 మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తి



జిల్లాలో 2.29లక్షల పాడి పశువుల నుంచి సగటున నెలకు 37,338 మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తి జరుగుతుంది. దేశవాళీ ఆవులు, గేదెలను వేర్వేరుగా జెర్సీ ముర్రా జాతి పశువులతో సంకరణం చేయడం వల్ల పాల ఉత్పత్తి ఘననీయంగా పెరిగింది. రాష్ట్రంలోని జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. రైతులకు అవసరమైన టోటల్ మిక్సడ్ రేషన్(టీఎంఆర్)ను అత్యధికంగా జిల్లాలోనే 80శాతం రాయితీపై పాడి రైతులకు అందజేశాం. గత రెండేళ్లలోను రూ.250 కోట్ల విలువైన టీఎంఆర్‌ను పాడి రైతులకు అందించాం.

- డాక్టర్ కర్నీడి మూర్తి,

డిప్యూటీ డైరెక్టర్, పశుసంవర్ధకశాఖ, అమలాపురం

జిల్లాలో ఆవులకంటే గేదెలే ఎక్కువ

జిల్లాలో తెల్లజాతి పశువుల కన్నా నల్లజాతి గోవులే అధికంగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 2.29లక్షల పాడి పశువులు ఉండగా వాటిలో 1,53,542 గేదెలు, 75,460 ఆవులు ఉన్నాయి. పంజాబ్ నుంచి ముర్రా జాతి గేదెలను ఎక్కువగా దిగుమతి చేయడం జరిగింది. ముర్రా జాతి గేదెల వీర్యంతో దేశీయ గేదెలను సంకర పరచడం ద్వారా పాల ఉత్పత్తి ఘననీయంగా పెరిగింది. గేదెలకు మాత్రమే ఈ విధానాన్ని పరిమితం చేయలేదు. జెర్సీ ఆవులను దేశవాళీ ఆవులతో క్రాసింగ్ చేయడంవల్ల పాల ఉత్పత్తి పెరిగేలా ఆవుల పెంపకం జరిగింది.

పాలతో ప్రయోజనాలు

పాలు తాగడం వల్ల మనిషికి అవసరమైన కాల్షియం లభిస్తుంది. పచ్చి పాలలో పోషక విలువలు, కాల్షియం ఉన్నప్పటికీ రకరకాల సూక్ష్మజీవుల వల్ల వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. గేదె పాలలో కొలస్ట్రాల్ శాతం తక్కువగా ఉండి మాంసకృత్తులు ఎక్కువగా ఉంటాయి. వెన్న శాతం గేదెపాలలోనే ఎక్కువగా ఉంటుంది. ఆవుపాలతో సమానంగా మేక పాలు మంచిని చేస్తుంటుంది. లాక్టోస్ సమస్యలు ఉన్న చిన్నపిల్లలకు ఆవుపాలకంటే మేక పాటు ఇవ్వడం మేలు, ఇక పాలతో ఎన్నో ఉపఉత్పత్తులు తయారవుతున్నాయి. పాల నుంచి ఉత్పత్తి అవుతున్న పన్నీర్‌కు మంచి డిమాండు ఉంది.

పూర్వ విద్యార్థి ప్రతిభకు అభినందనలు



కొత్తపేట, మే 31: కాంతి భారతి విద్యాసంస్థల పూర్వపు విద్యార్థి గొలకోటి నితిన్‌ధనుంజయకుమార్ ఈసెట్‌లో స్టేట్ 3వ ర్యాంకు, తెలంగాణలో 4వ ర్యాంకు సాధించాడు. పాఠశాలలో నర్సరీనుంచి 10వతరగతి వరకు అతడు చదివాడు. అతడిని పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించి అభినందించింది. కాంతి భారతి విద్యా సంస్థల డైరెక్టర్ తోట సత్యవాణి వెంకటేశ్వరరావు, కందికట్ల శ్రీనివాసరావు, డీవైవీ శేఖర్, సీహెచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

- అమలాపురం, మామిడికుదురు, కపిలేశ్వరపురం, కె.గంగవరంలలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీలు
- పొగాకు అనర్థాలపై అవగాహన

సాదాసీదాగా కౌన్సిల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్

ముమ్మిడివరం, మే 31: వర్షాకాలం సీజన్ త్వరలో ప్రారంభం కానున్నందున శానిటేషన్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధికారులకు సూచించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. వర్షాకాలం సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రత్యేకశానిటేషన్ నిర్వహణపై వైద్యఆరోగ్యశాఖ, నగర పంచాయతీ అధికారులు ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సమావేశం కేవలం శానిటేషన్ నిర్వహణ, మంచినీటి సరఫరాకు సంబంధించి చేపట్టవలసిన చర్యలు, వాటి నిర్వహణకు నిధులు మంజూరుపై చర్చించి సమావేశాన్ని సాదాసీదాగా ముగించారు. ప్రత్యేక శానిటేషన్ నిర్వహణకు సంబంధించి బ్లీచింగ్, క్రిమిసంహారక మందుల కొనుగోలు, అవసరమైన కన్జెర్వన్సీ సామగ్రి కొనుగోలుకు రూ.2లక్షలు, మంచినీటి సరఫరాకు సంబంధించి 20 వార్డుల్లో పైపులైన్ల నిర్వహణ, పంపులు, మోటార్లు, వాటర్ పైపులైన్ల లీకేజీ వంటి మరమ్మతుల కోసం నగర పంచాయతీ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసేందుకు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. తొలుత 4వ వార్డు కౌన్సిలర్ భార్య, వార్డు వలంటీరు అబ్బాదాసుల వెంకటలక్ష్మి ఆకస్మిక మృతికి సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేసింది. ఆమె అందించిన సేవలను కొనియాడారు. సమావేశంలో కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి, వైస్‌చైర్మన్ వేటుకూరి బోసురాజు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఇష్టపడి తినే విధంగా వంటకాలు ఉండాలి



పి.గన్నవరం: మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారిణి కమలకుమారి

పి.గన్నవరం, మే 31: ప్రతి విద్యార్థి ఇష్టపడి తినేవిధంగా మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలని డీఈవో కె.కమలకుమారి నిర్వాహకులకు సూచించారు. పి.గన్నవరం హైస్కూల్లో మధ్యాహ్న భోజనం తయారీ నిర్వాహకులకు ఎంఈవో కె.హెలీనా అధ్యక్షతన నిర్వహించిన ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం ప్రతి విద్యార్థికి పోషకాలతో కూడిన రుచి కరమైన భోజనం అందించాలన్నారు. హాట్‌పొంగల్, ఎగ్‌కర్రి, వెజ్‌కర్రి తదితర పదార్థాల తయారీ విధానాన్ని ఆన్‌లైన్ ద్వారా నిర్వాహకులకు అవగాహన కల్పించారు. విపత్తులు సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. పలువురు నిర్వాహకులు తయారుచేసి తీసుకువచ్చిన వంటకాలను ఆమె రుచి చూశారు. అసిస్టెంట్ ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ డి.రమేష్, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు డీవీవీఎస్ ప్రసాద్‌పాల్గొన్నారు.

మార్గదర్శకాలు పాటించాలి

ఉప్పలగుప్తం, మే 31: మధ్యాహ్న భోజనం తయారీలో మార్గదర్శకాలను విధిగా పాటించాలని ఎస్ఎస్ఏ సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం సూచించారు. గొల్లవిల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు వంటలపై ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. నిర్వాహకులకు వంటల పోటీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు కె.కిరణ్‌బాబు, సత్తి సత్యకృష్ణ , సిబ్బంది బద్రి జాన్‌బాబు, కె.వెంకటేశ్వరరావు, సీఆర్పీలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు శిక్షణ

మలికిపురం, మే 31: స్థానిక మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా మండల విద్యాశాఖ అధికారి వైవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ నూరుశాతం విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేలా వంటలు రుచిగా తయారు చేయాలన్నారు. వంట చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యాధికారి ఎ.చంటి వివరించారు. మధ్యాహ్న భోజనం తయారు చేసేటప్పుడు గ్యాస్ ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను అగ్నిమాపకదళ అధికారి బాలకృష్ణ వివరించారు. ఎంఈవో ఎం.విజయశ్రీ, హెచ్ఎంలు సీహెచ్ బాలచింతామణి, ఆర్.శేఖర్, రవి, సీఆర్ఎంటీలు, పీటీఐలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయం మధ్యలో విద్యుత్ స్తంభం



ఆత్రేయపురం, మే 31: ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి ఆలయం మధ్యలో విద్యుత్ స్తంభం ఉండటంతో పెనుప్రమాదం పొంచి ఉంది. ఎదురుగా జగన్మోహిని కేశవస్వామి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఈ ఆలయానికి వెళ్లే భక్తులు కమండలేశ్వరస్వామిని దర్శించుకుంటారు. వాహనాలు రద్దీ పెరగడంతో పాటు గుడి పక్క నుంచే నిత్యం రాకపోకలు సాగుతుంటాయి. ఈక్రమంలో మధ్యలో ఆలయం, ఇటు షాపింగ్ కాంప్లెక్స్ అటు అన్నదాన సత్రం ఉన్నాయి. మధ్యలో ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభంతో పెనుప్రమాదం పొంచి ఉంది.

ఆల్‌క్యాస్ట్ కాలనీకి తాగునీరు



మామిడికుదురు, మే 31: మామిడికుదురు ఆల్‌క్యాస్ట్ కాలనీకి ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందిస్తున్నారు. 'ఆల్‌క్యాస్ట్ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించండి' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం వెలువడిన వార్తకు పంచాయతీ అధికారులు స్పందిం చారు. ట్యాంకర్ల ద్వారా కాలనీలో తాగునీరు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి వీవీఎస్వీ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా చూస్తానని తెలిపారు. ఎక్కడైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకువస్తే, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



ఆత్రేయపురం, మే 31: జాతీయ స్థాయి ఉమెన్స్ కరాటే పోటీలకు బొబ్బర్లంకకు చెందిన ఆకుమూరి రాజేశ్వరి, పోలాటి క్రాంతిరోజ్, చల్లపూడి ప్రసన్న, ములపర్తి స్వాతి ఎంపికయ్యారని గ్రాండ్ మాస్టర్ సుందరం, కోచ్ శోభన్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు బీవీవీ సంఘ క్యాంపస్‌లో నేషనల్ స్థాయి పోటీలు జూన్ 10 నుంచి 13వరకు నిర్వహిస్తారు.

కేన్సర్ మృతుల్లో పొగాకు కారకులు 25శాతం మంది



అమలాపురం: ర్యాలీలో జిల్లా అధికారిణి డాక్టర్ పద్మశ్రీరాణి

అమలాపురం టౌన్, మే 31: ఏటా కేన్సర్‌తో మరణిస్తున్న వారిలో 25శాతం మందికి పొగాకే కారణమవుతుందని జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారిణి డాక్టర్ పద్మశ్రీరాణి పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ర్యాలీ చేపట్టారు. అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రి వద్ద ర్యాలీని డాక్టర్ పద్మశ్రీరాణి ప్రారంభించారు. గడియార స్తంభం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. పొగాకు వాడకం వల్ల సంతానోత్పత్తి సమస్యలు వచ్చే అవకాశం ఉందని వివరించారు. పొగాకు రహిత సమాజం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ సౌమ్య, ఈఎన్‌టీ స్పెషలిస్టు డాక్టర్ అనూష, ప్రమీల, జన కల్యాణ్ శ్రీను, స్వచ్ఛంద సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

మామిడికుదురు: పొగాకు ఉత్పత్తులకు ప్రజలుదూరంగా ఉండాలని ఎంఎల్‌హెచ్‌పీ బీహెచ్ ఇందిర అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పాశర్లపూడిలో అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ప్రజలకు పొగాకు తాగడం వల్ల కలిగే అనార్థాలను వివరించి వారికి అవగాహన కల్పించారు.హెల్త్ అసిస్టెంట్ కె.సూర్యనారాయణ, ఏఎన్ఎం డి.భూలక్ష్మి, ఆశ కార్యకర్త కేవీ లక్ష్మి పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి రత్నకుమారి మాట్లాడుతూపొగాకు ఉత్పత్తులు వాడకం వల్ల కలిగే అనర్థాలు, వ్యాధులు గురించి అవగాహన కల్పించారు.ఏఎన్ఎంలు, ఆశాలు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

కె.గంగవరం: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కె.గంగవరంలో శుక్రవారంద్రాక్షారామకు చెందిన బీమేశ్వరా దంత వైద్యశాల వైద్యుడు బి.క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పొగాకు వల్ల కలిగే అనర్థాలు వివరించి ప్రజలకు అవగాహన కలిగించారు. పొగాకు, బీడీ, సిగరెట్ తాగడం వల్ల నోటి కేన్సర్ బారిన పడతారన్నారు.

అలరించిన ఇంద్రజాల ప్రదర్శన

యానాం, మే 31: స్థానిక మెట్టకుర్రులోని మదర్ థెరిస్సా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బాలల వేసవి వినోద కేంద్రాన్ని ప్రారంభించారు. ఈకేంద్రంలో యానాం జనవిజ్ఞాన వేదిక, ప్రజా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా తిరువూరు నుంచి వచ్చిన ఇంద్రజాలకుడు ఎం.పాపారావు నిర్వహించిన ఇంద్రజాల ప్రదర్శన విద్యార్థులను అలరించింది. ఈసందర్భంగా ఆయన అనేక అంశాలను ప్రదర్శించారు. ఈప్రదర్శనలో మంత్రాలు ఏమీ లేవని, హస్త లాఘవం మాత్రమే అన్నారు. ప్రతి ప్రదర్శనకు సైంటిఫిక్ రీజన్ ఉంటుందన్నారు. ఈప్రదర్శన విద్యార్థులను అలరించింది. బడి పిల్లలకు వేసవి విరామంతో వినోదంతో కూడిన విజ్ఞానం అందించడమే జేవీవీ ముఖ్య ఉద్దేశమని యానాం కమిటీ గౌరవ అధ్యక్షుడు దాట్ల దేవదానం రాజు అన్నారు. కార్యక్రమంలో యానాం కమిటీ అధ్యక్షుడు ఆనాల వీరభద్రరావు, జిల్లా నాయకుడు కేవీ రమణ, ఉపాధ్యాయులు నాగరాజు, శ్రీరామ్, ప్రజాసంఘాల నాయకులు దుర్గప్రసాద్, కుంచే సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వీడ్కోలు సన్మానం

అమలాపురం టౌన్, మే 31: జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ ఎస్ఐగా పనిచేసిన వి.సోమేశ్వరరావు ఉద్యోగవిరమణ చేశారు. 42 ఏళ్ల పాటు పోలీసు శాఖలో ఆయన అందించిన సేవలను వివరిస్తూ శుక్రవారం ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆధ్వర్యంలో సోమేశ్వరరావు దంపతులను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఎస్బీ సీఐ బి.రాజశేఖరరావు, డీసీఆర్బీ సీఐ ఎం.అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినికి సన్మానం

ఉప్పలగుప్తం, మే 31: భీమనపల్లి శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ జడ్పీ ఉన్నత పాఠశాల బయోలాజికల్ సైన్స్ అసిస్టెంట్ కుసుమ వెంకటరమణ శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ప్రధానోపాధ్యాయుడు నూకల సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అరవ నాయుడు,రాయి వెంకటేశ్వరరావు, పశ్చిమాల శివనాగరాజు. కామర మధు, జల్లి సత్యనారాయణ, పూర్ణిమ, లలిత, రాజేశ్వరి, ప్రసాద్, బ్రహ్మారావు, సుబ్బారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంయమనం పాటించాలి

రాయవరం, మే 31: జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు నేపథ్యంలో గ్రామాల్లో రాజకీయ పార్టీల నాయకులు సంయమనం పాటించాలని మండపేట రూరల్ సీఐ కె.శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం రాయవరం పోలీస్ స్టేషన్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. ఫలితాల ప్రకటన అనంతరం గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. విజయోత్సవ ర్యాలీలు, సభలకు అనుమతులు లేవన్నారు. యాక్ట్ 30, సెక్షన్ 144 అమల్లో ఉందని, రోడ్లపై గుంపులు, గుంపులుగా ప్రజలు సంచరించరాదన్నారు. ఎస్ఐ జి.నరేష్, టీడీపీ, జనసేన, వైసీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా తిరుచ్చి పల్లకీ సేవ



చిన్నారుల కోలాటం

అమలాపురం రూరల్, మే 31: బండారులంక శ్రీపద్మావతి అలివేలు మంగ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి తీర్థ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిళలు సంప్రదాయబద్ధంగా తిరుచ్చి పల్లకీ సేవ నిర్వహించారు. శ్రీశ్రీనివాసా బాలమిత్ర సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై స్వామి-అమ్మవార్లను ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. వందలాది మంది మహిళలు ఏకరూప వస్త్రాలతో సంప్రదాయబద్ధంగా పల్లకీ సేవలో పాల్గొన్నారు. గోవింద నామస్మరణలు, లలితా సహస్రనామ పారాయణంతో పాటు కోలాటాలు, భజనలతో పల్లకీసేవ జరిగింది. దారి పొడవునా మహిళలు, స్వామి, అమ్మవార్లకు మంగళ హారతులు సమర్పించారు. అమలాపురం శ్రీకేశవ భజనమండలి రత్నమాల ఆధ్వర్యంలో కోలాటం, బండారులంక శ్రీరామభజన మండలి, పాండురంగవిఠల భజన సమాజం కోలాటాలు ఆకట్టుకున్నాయి. నల్లచెరువు ఇస్కాన్ భజన బృందం, అమలాపురం ఆర్ట్ ఫ్యామిలీ విద్యార్థులతో అన్నమయ్య కీర్తనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తొలుత ఆలయ అర్చకులు బీరక భీమేశ్వరరావు ఆధ్వర్యంలో బట్టా గణేష్-శ్రీదేవి దంపతులతో ఆలయంలో విశేష పూజాభిషేకాలు నిర్వహించారు. ఆయాకార్యక్రమాల్లో ఎంపీటీసీ అంకం హిమభారతి, బిళ్ల లక్ష్మీకుమారి, ఉప్పుగంటిసూర్యనాగలక్ష్మీకుమారి, లక్కింశెట్టి మోహిని, బళ్ల భవానీ, కారుపర్తి మల్లేశ్వరరావు శిష్యబృందం, చింతపట్ల బాబు, అంకం పెదరాజు, బిళ్ల విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

మామిడికుదురు, మే 31: గోగన్నమఠంలో వేంచేసి ఉన్న శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్యవాన్ని ఆలయ నిర్మాణ కమిటీ శుక్రవారం ఘనంగా నిర్వహించింది. చతుర్భుజ భద్రాద్రి సీతారామస్వామి, శ్రీభూసేమత వేంకటేశ్వరస్వామి, శ్రీవేణుగోపాలస్వామివార్ల నవమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కల్యాణోత్సవాన్ని చేశారు. స్వామివారి ధ్రువమూర్తులకు అభిషేకం, గ్రామోత్సవం, శ్రీపుష్పోత్సవం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన భారీ అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా సత్తెమ్మ తల్లి తీర్థం

కొత్తపేట, మే 31: అవిడి, కండ్రిగ సరిహద్దులోని పంట పొలాల మధ్య కొలువుతీరిన సత్తెమ్మతల్లి అమ్మవారి తీర్థం శుక్రవారం వైభవంగా జరిగింది. గురువారం రాత్రి అమ్మవారి జాతర నిర్వహించారు. శుక్రవారం పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవార్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కోలాట భజన కార్యక్రమం ఆకట్టుకుంది. ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

హనుమాన్‌జ్జయంతి కోసం ఏర్పాట్లు

మండపేట, మే 31: హనుమాన్‌జ్జయంతిని శనివారం నిర్వహించేందుకు ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండపేటపట్టణం, మండలంలో ఉన్న స్వామి వారి ఆలయాలను జయంత్యుత్సవాలకు ముస్తాబు చేశారు. మండపేట కరాచీ సెంటర్‌లో వందేళ్ల చరిత్ర గల సువర్ణవర్తక సంఘీయులకు చెందిన ఆంజనేయస్వామి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు అర్చకస్వామి ఖండపల్లి పవన్ కుమార్ సారథ్యంలో ఏర్పాట్లు చేశారు. రథం గుడిసెంటరు, బూరుగుంటరామాలయం, ధర్మగుండం రామాలయం వద్ద హనుమాన్‌జ్జయంతి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఎంపీడీవో ఉద్యోగ విరమణ

మలికిపురం, మే 31: మలికిపురం ఎంపీడీవో ముత్యం వీరాస్వామినాయుడు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఎంపీపీ ఎంవీ సత్యవాణి, మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఆయన్ను దుశ్శాలువాతో సన్మానించారు. ఉద్యోగ కాలంలో సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, తోటి సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థుల గుర్తింపు

అంబాజీపేట, మే 31: మండల వ్యాప్తంగా ప్రత్యేకావసర గల పిల్లల గుర్తింపులో భాగంగా ఇప్పటి వరకు 14మందిని గుర్తించినట్టు ఐఈఆర్టీలు ఎస్‌కే బేగం, ఎం.అశా తెలిపారు. వీరికి ఫిజియోథెరపి, విద్యాబోధన, యోగా, శారీరక కదలికలు వంటి ఆసనాలు నేర్పిస్తామన్నారు. ఈనెల7వరకు మండలంలో సర్వే చేసి మరి కొంత మంది పిల్లలను గుర్తిస్తామన్నారు.

ధనలక్ష్మి అమ్మవారికి బంగారు దుద్దులు

ఆలమూరు, మే 31: చెముడులంక జాతీయ రహదారి పక్కనే ఉన్న ధనలక్ష్మి అమ్మవారికి మడికి గ్రామానికి చెందిన కొడమంచిలి లక్ష్మి బంగారు దుద్దులను శుక్రవారం బహూకరించారు. వాటిని ఆలయ నిర్వాహకులు, చెముడులంక సర్పంచ్ తమ్మన శ్రీనివాస్‌కు అందజేశారు. ఆలయ అర్చకులు మున్నంగి ప్రభాకరశర్మ దుద్దులకు ప్రత్యేకపూజలు నిర్వహించి అమ్మవారికి అలంకరించారు.

వాసవి క్లబ్ చేయూత

ఆత్రేయపురం, మే 31: ఆత్రేయపురం వాసవి క్లబ్ ఎస్ఎస్ఎస్ విజయం ఆధ్వర్యంలో శుక్రవారం దాతల సాయంతో నిరుపేదలకు బియ్యం, దుప్పట్లు, చీరలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ చంద్రగుప్తా, పేరూరి నాగేశ్వరరావు, పట్నాల నాగరాజు, వెత్సా నాగవెంకటసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌స్టార్ కృష్ణ జయంతి



సూపర్‌స్టార్ కృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

అమలాపురంటౌన్, మే31: సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకలను శుక్రవారం అమలాపురం రమా థియేటర్ ఆవరణలో నిర్వహించారు. టౌన్ వైడ్ కృష్ణ అండ్ మహేష్‌బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు కొప్పిశెట్టి నరసింహమూర్తి ఆధ్వర్యంలో కృష్ణ చిత్రపటానికి పలువురు పూలమాలలువేసి నివాళులర్పించారు. అభిమానుల సమక్షంలో కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. గౌరవాధ్యక్షుడు చొల్లంగి రామకృష్ణ, కొప్పాడి రమేష్‌బాబు, కాలే గోవిందు, దొమ్మేటి శ్రీను, పాటి రవిరాయుడు, శ్రీను, సాంబయ్య, దంగేటి కనక పాల్గొన్నారు.

179మందికి ఉద్యోగావకాశాలు

అమలాపురం టౌన్, మే 31: కొంకాపల్లిలోని హెల్పింగ్ జాబ్ ప్లేస్‌మెంట్ కార్యాలయంలో శుక్రవారం అడబాల ట్రస్టు ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ అడబాల సాయి ఆధ్వర్యంలో జరిగిన జాబ్ మేళాకు 316మంది హాజరు కాగా 179మందికి డెక్కన్, ఐసీఐసీఐ, డైకిన్, ఫోక్స్‌కాన్ వంటి 13కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు దక్కాయని తెలిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆజాద్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యల్లమిల్లి నాగసుధాకొండ ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. అడబాల ట్రస్టు చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు.

జూన్ 12న పాఠశాలల పునఃప్రారంభం

యానాం, మే 31: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ, ఎయిడెడ్, సీబీఎస్ఈ స్కూళ్లను జూన్12న పునఃప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని విద్యాశాఖ డైరెక్టర్ పి.ప్రియదర్శిని తెలిపారు. జూన్6న పాఠశాలలు ప్రారంభించాల్సి ఉన్నప్పటికి ప్రస్తుతం అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రభుత్వం ఈనిర్ణయం తీసుకుందన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	: గంగం గణేశా
శ్రీలలిత	: హిట్‌లిస్ట్
శేఖర్ స్క్రీన్-1	: రాజు యాదవ్
శేఖర్ స్క్రీన్-2	: ఆ ఒక్కటీ అడక్కు
రమా	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
గణపతి	: బాక్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: భజే వాయువేగం
వెంకటపద్మావతి స్క్రీన్-2	: లవ్ మీ

దివ్యాంగ విద్యార్థుల కోసం సర్వే

కాట్రేనికోన, మే 31: మండలంలో దివ్యాంగ విద్యార్థుల కోసం భవిత కేంద్రం ఐఈఆర్టీలు ఎం.స్వర్ణలత, ఆర్.వీరబాబు సర్వే నిర్వహించనున్నారు. 0-18 ఏళ్ల మధ్య వయస్సు గల దివ్యాంగుల కోసం సర్వే చేస్తారు. ఇదే సర్వేలో పాఠశాలల బయట ఉన్న విద్యార్థులను గుర్తించి సమీప పాఠశాలలో చేర్పించే చర్యలు తీసుకుంటారు. జూన్ తొమ్మిది వరకు ఈసర్వే నిర్వహించనున్నారు.

విద్యుత్ వైర్లపై పడిన కొబ్బరి చెట్టు

అంతర్వేది, మే 31: సఖినేటిపల్లి మండలంలో శుక్రవారం విద్యుత్ మరమ్మతు పనులు చేపట్టారు. అయితే సఖినేటిపల్లి గ్రామం అడ్డాలపాలెం వద్ద గాలికి 33కేవీఏ లైన్‌పై కొబ్బరి చెట్టు పడడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయ సమయం మరింత పెరిగింది. వేసవి కాలం కావడంతో ప్రజలు ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్‌శాఖ సిబ్బంది కొబ్బరిచెట్టును తొలగించి సరఫరాను పునరుద్ధరించారు.

టీడీపీ నాయకుడు లచ్చిరాజుకు నివాళి

అంతర్వేది, మే 31: కేశవదాసుపాలెం గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు పేరిచెర్ల లచ్చిరాజు శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతదేహానికి పార్టీ మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని టీడీపీ జెండా కప్పి నివాళులర్పించారు. యెనుముల సత్యనారాయణ, బెల్లంకొండ సత్యనారాయణ, పోతురాజు కృష్ణ, యెనుముల బుజ్జి, ముత్యాల ప్రసాద్, అంతర్వేదిపాలెం పుల్లయ్య, సరాగుల రాజారత్నం, పిన్నమరాజు శ్రీనివాసరాజు, కాల్వమొగ సెంటర్ వర్తకసంఘ సభ్యులు తదితరులు నివాళులర్పించారు.

గొర్రెలకు చిటుక వ్యాధి నివారణకు టీకాలు వేయించాలి

అల్లవరం, మే 31: గొర్రెలు, మేకలకు చిటుక వ్యాధి సోకకుండా నివారణ టీకాలు వేయించాలని పశుసంవర్ధక సహాయ సంచాలకులు ఎల్.విజయారెడ్డి అన్నారు. కోడూరుపాడులో గొర్రెలు, మేకలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశువైద్యాధికారి మేడిద నారాయణరావు, సీహెచ్ వీరబాబు, ఎన్.శ్రీను, ఎన్.సూరిబాబు, బి.శివ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

భాస్కరరెడ్డి సేవలు చిరస్మరణీయం

ఆలమూరు, మే 31: మడికి శివారు చిలకలపాడు ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడు గొలుగూరి భాస్కరరెడ్డి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈసందర్భంగా భాస్కరరెడ్డిని గ్రామంలో ఘనంగా సత్కరించారు. గ్రామస్తులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆయన సేవలను కొనియాడారు. నర్సిపూడి జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు వజ్రపు డేవిడ్‌రాజు ఉద్యోగవిరమణ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు.

బావిలో పడి వ్యక్తి మృతి



మామిడికుదురు, మే 31: బావిలో పడి వ్యక్తి మృతి చెందాడు. పెదపట్నలంక గ్రామానికి చెందిన యేడిద సాయిబాబు (48) వడ్రంగి పని జీవన ఆధారంగా జీవిస్తున్నాడు. సాయిబాబు గురువారం రాత్రి పని ముగించుకుని ఆలస్యంగా ఇంటికి వచ్చాడు. తరువాత బహిర్భూకి వెళ్లి ఎంత సేపటికీ తిరిగి రాలేదు. భార్య దుర్గాభవానీకి అనుమానం వచ్చి స్థానికుల సాయంతో గాలించింది. సాయిబాబు మోటబావిలో పడి కొట్టుమిట్టాడుతుండగా ఆమె కేకలు వేయడంతో స్థానికులు వచ్చి బావిలో దిగి సాయిబాబును బయటకు తీశారు. స్థానికులు అతడికి సీపీఆర్ చేశారు. 108అంబులెన్సు సిబ్బంది వచ్చి సాయిబాబును పరీక్షించి అప్పటికే అతడు మృతిచెందినట్టు నిర్ధారించారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.సురేష్ తెలిపారు. రెక్కాడితే గాని డొక్కాడదని, భర్త మృతితో తాము సర్వం కోల్పోయామని భార్య దుర్గాభవాని, ఇద్దరు కుమార్తెలు తనుశ్రీ, కావ్యశ్రీ కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.

దక్షిణామూర్తి వార్షికోత్సవం

అంబాజీపేట, మే 31: ఇరుసుమండలో ఉన్న శ్రీబాలా త్రిపుర సుందరి సమేత ఆనందరామేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన శ్రీ మేధా దక్షిణామూర్తి ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సుంకర స్వామినాయుడు, సీతారామదాసునాయుడు దంపతులు మేధాదక్షిణామూర్తి విగ్రహం వద్ద గణపతి పూజ, రుద్రాభిషేకాలు నిర్వహించారు.

వైద్య విద్యతో సేవ, ఉపాధికి అవకాశాలు మెండు

ద్రాక్షారామ, మే 31: వైద్య విద్యతో రోగులకు సేవలు అందించడంతో పాటు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని ప్రముఖ వైద్యులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం అంబికపల్లి అగ్రహారం రాజరత్న కిట్స్ ఇంజనీరింగ్, నర్సింగ్ కళాశాలలో వైద్య విద్యపై బైపీసీ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బైపీసీ విద్యార్థులు వైద్యులు కాకపోయినా వారికి ఫిజియోథెరపి, అగ్రి, వెటర్నరీ, ఫిషరీస్, బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఫార్మసీ, బీడీఎస్ వంటి ఎన్నో కోర్సులు ఉన్నాయన్నారు. వైద్య వృత్తికి సంబంధించి పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి వైద్య రంగంలో అందించిన సేవలను కళాశాల యాజమాన్యం కొనియాడుతూ జీవితసాఫల్య పురస్కారం అందజేసింది. బైపీసీ, నర్సింగ్ విద్యార్థులు, పరిపాలనాధికారి ఏఎస్‌వీ రవిధర్, అధ్యాపకులు, సిబ్బంది, కళాశాల డైరెక్టర్ పవన్ వంశీ పాల్గొన్నారు.

కొత్తపేట ఎన్నికల కౌంటింగ్ వాయిదా వేయాలి

రావులపాలెం, మే 31: కొత్తపేట నియోజకవర్గంలో అసెంబ్లీ అభ్యర్థులు ఒకరు ఓటుకు రూ.2వేలు, మరొకరు రూ.1000 చొప్పున 1.50లక్షల మందికి మే 10, 11, 12తేదీల్లో బహిరంగంగా పంపిణీ చేశారని, దీని వల్ల కౌంటింగ్ వాయిదా వేయాలని కోరుతూ అమరావతిలోని చీఫ్ ఎన్నికల కమిషనర్ మీనాకు శుక్రవారం పూర్తి వివరాలతో వినతిపత్రాన్ని అందజేసినట్టు మెర్ల శాస్త్రులు తెలిపారు. నగదు పంపిణీ వాస్తవమైతే ఎన్నికలు రద్దు చేయాలని, కాకపోతే కౌంటింగ్ జరపాలన్నారు. ఈఫిర్యాదును చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు పంపించి నిర్ణయం తీసుకుంటామని మీనా తెలిపారని శాస్త్రులు అన్నారు.

పది సప్లిమెంటరీ పరీక్షకు 302మంది హాజరు

ముమ్మిడివరం, మే 31: పది సప్లిమెంటరీ పరీక్షకు సంబంధించి జిల్లాలో శుక్రవారం 352మంది పరీక్షలు రాశారు. సోషల్ పేపరుకు సంబంధించి జిల్లాలో 16పరీక్షా కేంద్రాల్లో 918మంది పరీక్షలు రాయాల్సిఉండగా 556మంది గైర్హాజరయ్యారని, 352మంది పరీక్ష రాసినట్టు డీఈవో ఎం.కమలకుమారి తెలిపారు. డీఈవో కమలకుమారి మూడు పరీక్షా కేంద్రాలను, అసిస్టెంట్ కమిషనర్ ఎన్.సురేష్ మూడు పరీక్షా కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ పది పరీక్షా కేంద్రాలను తనిఖీ నిర్వహించారు. పది సప్లిమెంటరీ పరీక్షకు సంబంధించి ముమ్మిడివరం మండలంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో ఐదుగురు విద్యార్థులు పరీక్షకు హాజరైనట్టు ఎంఈవో బొజ్జా రమణశ్రీ తెలిపారు. సోషల్ పరీక్షకు సంబంధించి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 54మంది పరీక్షా రాయాల్సి ఉండగా 49మంది గైర్హాజరయ్యారని, ఐదుగురు పరీక్ష రాసినట్టు ఎంఈవో తెలిపారు.

మొక్కుబడిగా సాగిన మండల సర్వసభ్య సమావేశం

రాయవరం, మే 31: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. సమావేశం మొక్కుబడిగా సాగింది. తొలుత నాలుగు శాఖల అధికారులు ఆయా శాఖల ప్రగతిని సమావేశంలో వివరించారు. ఎంపీపీ నౌడు వెంకటరమణ మాట్లాడుతూ వేసవిలో గ్రామాల్లో మంచినీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్‌కు అనుగుణంగా సమావేశం నిర్వహించినట్టుఎంపీడీవో కె.వెంకటలక్ష్మి తెలిపారు. తహశీల్దారు కృష్ణారావు, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ

మలికిపురం, మే 31: కత్తిమండలో డంపింగ్ యార్డు నుంచి కంపోస్టు ఎరువు తయారుచేసే విధానంపై అవగాహన కల్పించారు. తాడేపల్లిగూడెం హార్టీకల్చర్ యూనివర్సిటీ సిబ్బంది చెత్త నుంచి సంపద ఏవిధంగా తయారు చేయాలి, అనవసరంగా పెరిగే మొక్కలను ఏవిధంగా వాడుకోవాలో వివరించారు. ఎంపీడీవో ముత్యం వీరాస్వామినాయుడు పాల్గొన్నారు.

భట్నవిల్లి రోడ్డు ప్రమాదంలో ఐదుకు చేరిన మృతులు



ప్రశాంత్ కుమార్ ఫైల్ ఫొటో

అమలాపురం రూరల్, మే 31: భట్నవిల్లి రోడ్డు ప్రమాదంలో మాదాసి ప్రశాంత్‌కుమార్ మృతితో మృతుల సంఖ్య ఐదుకి చేరింది. యానాంలో ఏప్రిల్ 28న పుట్టిన రోజు వేడుకలు జరుపుకుని యువకులు ఆటోలో నగరం వైపు వెళ్తున్నారు. భట్నవిల్లి జాతీయ రహదారిపై ఏప్రిల్ 28వ తేదీ అర్ధరాత్రి దాటిన తరువాత భట్నవిల్లి సెంటర్‌లో కాకినాడ వైపు వెళ్తున్న లారీని ఆ ఆటో ఢీకొట్టింది. ఈప్రమాదంలో అక్కడికక్కడే మామిడికుదురు మండలం నగరానికి చెందిన సాపే నవీన్(22), కొల్లాబత్తుల జతిన్(26), పాసర్లపూడికి చెందిన నల్లి నవీన్(27), పి.గన్నవరం మండలం మానేపల్లి గ్రామానికి చెందిన వల్లూరి అజయ్ (18) మృతి చెందారు. ఆ ప్రమాదంలో గాయపడి అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మామిడికుదురు మండలం నగరం పితానివారి మెరకకు చెందిన మాదాసి ప్రశాంత్‌కుమార్(16) రెండు రోజుల క్రితం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యాడు. అయితే ప్రశాంత్‌కుమార్ శుక్రవారం సాయంత్రం ఇంటి వద్ద మృతిచెందినట్టు తాలూకాఎస్ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు.

మండపేటలో పోలీసు బలగాల మాక్ డ్రిల్

మండపేట, మే 31: జూన్4న జరిగే సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో రామచంద్రపురం, ఏఆర్ డీఎస్పీలు రామకృష్ణ, పార్థశారది ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలవపువ్వు సెంటర్‌లో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. అల్లర్లు జరిగినప్పుడు పోలీసులు తీసుకునే చర్యలు గురించి వివరించార ు. కాల్పులు, బాష్పవాయువు ప్రయోగం తదితర వాటిని చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కౌంటింగ్‌రోజున 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు గుమికూడదన్నారు. పట్టణ, రూరల్ సీఐలు అఖిల్‌జమా, శ్రీధర్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.